నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, శనివారం 4 జనవరి 2025 | YADADRI BHUVANAGIRI

సావిత్రిబాయిపూలేకు నివాళి

భువనగిరి కలెక్టరేట్, జనవరి 3 : సామాజిక సంస్కర్త, ఆధునిక భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలే జయంతిని శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి కలెక్టర్ హనుమంతరావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర గెజిటెడ్ ఉద్యోగుల సంఘం ట్రెజరర్ మందడి ఉపేందర్‌రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జగన్మోహన్‌ప్రసాద్, బీసీ సంక్షేమ శాఖ అధికారి యాద య్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ కార్యాలయంలో సావిత్రీబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

ముమ్మరంగా యాసంగి సాగు

జిల్లాలో 60 శాతం పంటల సాగు పూర్తి

- అధిక శాతం రైతులు వరి వైపే మొగ్గు
- ఇతర రాష్ట్రాల వలస కూలీలకు డిమాండ్
- సర్కారు నిర్లక్ష్యంతో గత యాసంగిలో సాగునీటికి ఇక్కట్లు
- ఈ సారైనా అవస్థలు తప్పేనా..?
- రైతు భరోసా సాయం కోసం రైతుల ఎదురుచూపులు

జిల్లాలో యాసంగి సాగు పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే 60 శాతం విస్తీర్ణంలో సాగు పూర్తయ్యింది. అధిక శాతం మంది రైతులు వరి వైపు మొగ్గు చూపుతున్నారు. వ్యయసాయ పనుల ఇతర రాష్ట్రాల కూలీలు ఉపాధి పొందుతున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో గతేడాది యాసంగిలో నీటికి తీవ్ర ఇబ్బందులు తలెత్తగా, ఈ సీజన్‌లోనైనా కష్టాలు తీరుతాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు సర్కారు మంత్రి వర్గ ఉప సంఘం పేరుతో రైతు భరోసా ఇవ్వకుండా కాలయాపన చేస్తూ పెట్టుబడి కోసం ఎదురు చూస్తున్న అన్నదాతలను అవస్థల పాలు చేస్తున్నది.

– యాదాద్రి భువనగిరి, జనవరి 2 (నమస్తే తెలంగాణ)

రాజాపేటలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

యాసంగి సీజన్‌కు సంబంధించి వ్యవసాయ శాఖ అధికారులు యాక్షన్ ప్లాన్ రూపొందించారు. అందులో సాగు, విత్తనాలు, ఎరువుల ఇండెంట్‌కు సంబంధించిన వివరాలు పొందుపరిచారు. ఈ ఏడాది యాసంగిలో అన్ని పంటలు కలుపుకొని 3,19,320 ఎకరాల్లో సాగు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో 2.98లక్షల ఎకరాల్లో వరి, మిగతా పంటలన్నీ కలిపి 21,320 ఎకరాల్లో పంటలు ఉన్నాయి. 75,500క్వింటాళ్ల వరి విత్తనాలు, 57,816 టన్నుల ఎరువులు అవసరమని లెక్కలు వేశారు. ఇప్పటికే రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. అధిక శాతం మంది రైతులు వరి నాట్లు వేశారు. మిగిలిన వాళ్లు దుక్కులు దున్నారు. సంక్రాంతి వరకు సాగు పనులు పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 1.50లక్షల ఎకరాల్లో వరి సాగు చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ తెలిపారు.

పొలం పనులకు ఇతర రాష్ట్రాల కూలీలు..

గతంలో బీఆర్ఎస్ చేపట్టిన మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువుల్లో పూడికతీతతో ఎక్కడ చూసినా జలకళ కనిపించేది. రైతు బంధు సాయంతో రైతులు రంది లేకుండా వ్యవసాయం చేసుకునేవారు. మరికొందరు భూమిని కౌలుకు తీసుకొని సాగు చేసేది. సాగు విస్తీర్ణం పెరుగడంతో వ్యవసాయ పనులకు మరికొంత మంది కూలీల అవసరం పడేది. దాంతో ఇతర రాష్ట్రాల కూలీలు జిల్లాకు కూలీలను తీసుకురావడం మొదలైంది. ప్రతి సీజన్ లోనూ అది అలా కొనసాగుతూ వస్తున్నది. ప్రస్తుతం కూడా వివిధ రాష్ట్రాల నుంచి కూలీలు వచ్చారు. కూలి తక్కువగా ఉండడంతో పాటు ఎక్కువ పని చేస్తుండడంతో ఇతర రాష్ట్రాల కూలీలను తీసుకురావడంపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. గుత్తా లెక్కన కూలి మాట్లాడుకుని ఉపాధి కల్పిస్తున్నారు. ఎక్కువగా ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గడ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల కూలీలు వలసలు వస్తున్నారు.

సాగు నీటి కష్టాలు అధిగమించేనా..?

బీఆర్ఎస్ హయాంలో పదేండ్లలో ఏనాడూ సాగు నీటికి ఇబ్బందులు తలెత్తలేదు. కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న అనేక చర్యలతో చెరువులు కళకళలాడాయి. భూగర్భ జలాలు పెరిగాయి. కాగా, గత యాసంగి సీజన్‌లో తొలిసారి నీటి కష్టాలు మొదలయ్యాయి. యాసంగిలో సాగు నీరు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనేక మంది ట్యాంకర్లతో పొలాలను తడిపే ప్రయత్నం చేశారు. సకాలంలో నీళ్లు అందక పొలాలు ఎండిపోయాయి. ఎండిన పంటలు పశువులకు దాణాగా మారాయి. ఇప్పటికే భూగర్భ జలాలు ఇంకిపోవడం, అధిక శాతం చెరువులు నీళ్లు లేక ఖాళీగా మారడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అందని రైతు భరోసా

రైతు వ్యవసాయ పనులకు నాడు బీఆర్ఎస్ సర్కారు అండగా నిలిచింది. సీజన్ ప్రారంభంలోనే పంటకు పెట్టుబడి అందించేది. దుక్కులు దున్నే సమయంలోనే రంధనుగా అన్నదాత ఖాతాల్లో ఎకరాకు రూ.5వేల చొప్పున నగదు జమ చేసేది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారింది. రైతు భరోసా పేరుతో ఎకరాకు ఏడాదికి 15 ఇస్తామని చెప్పినా ఇప్పటి వరకు ఆచరణకు నోచలేదు. గతేడాది యాసంగి సీజన్‌లో ధాన్యం అమ్ముకునే సమయంలో పెట్టుబడి డబ్బులు జమ చేయగా, ఖరీఫ్ పైసలు ఇంకా ఇవ్వలేదు. మంత్రి వర్గ ఉప సంఘం పేరుతో కాలయాపన చేయడం తప్ప అమలు చేయడం లేదు. పెట్టుబడి సాయం జమ చేయకపోవడంతో అనేక మంది రైతులు అప్పులు చేసి సాగు పనులు చేస్తున్నారు. జిల్లాలో దాదాపు 2.20లక్షల మంది రైతులు పెట్టుబడి సాయం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ నేతలు

కేటీఆర్‌ను కలిసిన ఉమ్మడి జిల్లా నేతలు

- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో నూతన సంవత్సర శుభాకాంక్షలు

సూర్యాపేట, జనవరి 3(నమస్తే తెలంగాణ) : నూతన సంవత్సరం సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఉమ్మడి నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ నేతలు కలిశారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో హైదరాబాద్ నందినగర్‌లోని నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గాదరి కిశోర్‌కుమార్, చిరుమర్తి లింగయ్య, కుసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, నలమోతు భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, జడ్పీ మాజీ చైర్మన్లు బండ నరేందర్ రెడ్డి, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, నల్లగొండ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రెగట్టె మల్లికార్జున్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు చాడ కిషన్‌రెడ్డి, కంచర్ల రామకృష్ణారెడ్డి, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, నంద్యాల దయాకర్‌రెడ్డి, గుజ్జ యుగంధర్‌రావు, నేవూరి ధర్మేందర్‌రెడ్డి, పల్లె ప్రవీణ్‌రెడ్డి, వలమల్ల కృష్ణ, నూకల యుగంధర్‌రెడ్డి ఉన్నారు.



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, మాజీ జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి

శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు

హక్కుల సాధికారితకు దోహదపడాలి

- పారా లీగల్ వలంటీర్లు న్యాయసేవా సంస్థ-ప్రజలకు వారధులుగా ఉండాలి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు

భువనగిరి అర్బన్, జనవరి 3: పారా లీగల్ వలంటీర్లు న్యాయసేవ సంస్థకు, ప్రజలకు మధ్య వారధులుగా ఉండాలని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు సూచించారు. పట్టణంలోని పెన్షనర్ల భవనంలో పిల్లల స్నేహపూర్వక న్యాయ సేవల పథకంపై ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వలంటీర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. పారా లీగల్ వలంటీర్లు చట్ట పరమైన ప్రజల హక్కుల సాధికారతకు దోహదపడాలన్నారు. ప్రభుత్వ వ్యవస్థలు ప్రజలకు చేరువలో ఉండేట్లు శిక్షణను పూర్తి చేసుకుని నిస్వార్థంగా సేవలు అందించాలని సూచించారు. వలంటీర్లు బాలల సంరక్షణకు న్యాయ సేవ అధికార సంస్థ ద్వారా అందించాల్సిన సేవలు, బాధ్యతలపై జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి వి.మాధవీలత వివరించారు. కార్యక్రమంలో భువనగిరి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బి.హరినాథ్, న్యాయవాదులు ఎన్.రమేశ్‌కుమార్, భువనగిరి సబ్ జైలు సూపరింటెండెంట్ నెహ్రూ, సహాయ న్యాయవాదులు ఎస్.జైపాల్, జి.శంకర్, రాజశేఖర్, నాగరాజు, ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

అబ్బురపరిచిన ఆవిష్కరణలు

సైన్స్‌ఫెయిర్‌లో ప్రారంభించి ఎగ్జిబిట్‌ను పరిశీలిస్తున్న టీచర్స్ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, డీఈఓ భిక్షపతి తదితరులు

- ఉత్సాహంగా సైన్స్ ఫెయిర్ - ఇన్‌స్పైర్ మానక్ అవార్డుల ప్రదర్శన
- జిల్లావ్యాప్తంగా 321 ప్రాజెక్టులు
- ప్రారంభించిన టీచర్స్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠీ

రామగిరి, జనవరి 3 : బాలల శాస్త్రవేత్తలు అద్భుతమైన ఆవిష్కరణలతో భళా అనిపించారు. సృజనాత్మకతతో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని చాటి అబ్బుర పరిచారు. జిల్లా సైన్స్ ఫెయిర్ – ఇన్‌స్పైర్ మానక్ అవార్డుల 2023–24 ప్రదర్శన నల్లగొండలోని డాన్‌బాస్కో స్కూల్‌లో శుక్రవారం ప్రారంభమైంది. ఎగ్జిబిట్లు తెచ్చిన విద్యార్థులు, గైడ్ టీచర్లు, సందర్శనకు వచ్చిన విద్యార్థులతో ఆ ప్రాంగణమంతా సందడిగా కనిపించింది. 'సుస్థిర అభివృద్ధిలో శాస్త్ర సాంకేతిక పాత్ర' అనే ప్రధానాంశంతోపాటు బీఈడీ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన టీచర్ లెర్నింగ్ పరికరాలు ప్రదర్శించారు. జిల్లా వ్యాప్తంగా 215 సైన్స్ ప్రాజెక్టులు, బీఈడీ విద్యార్థుల టీఎల్ఎం, 106 ఇన్‌స్పైర్స్ ప్రాజెక్టులు కలిపి మొత్తం 321 ఆవిష్కరణలను ప్రదర్శించారు. తొలి రోజు ప్రదర్శనను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అల్లుబెల్లి నర్సిరెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రాజెక్టులను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ సైన్స్ ద్వారా శాంతి సమాజాన్ని సృష్టిద్దామని పిలుపునిచ్చారు. సైన్స్ అభివృద్ధి కోసం అందరూ కృషి చేయాలన్నారు. విద్యార్థులు ప్రయోగాలకు ప్రాధాన్యమిచ్చేలా ఉపాధ్యాయులు బోధన చేపట్టాలన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఉపాధ్యాయినులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆమె స్ఫూర్తితో పని చేసి ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి కృషి చేయాలన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠీ మాట్లాడుతూ జీవన శైలిని ఉన్నతంగా మార్చే శక్తి సైన్స్‌కు ఉందన్నారు. రిలేటివిటీ థియరీకి సైన్స్ పునాది వేసిందని తెలిపారు. విద్యార్థులు సైన్స్, గణితం అంశాలకు సంబంధించి రోజూ ఒక్క పేజీ అయిన కచ్చితంగా చదువాలని సూచించారు. అనంతరం జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన రోడ్డు భద్రత పోస్టర్లను ఆవిష్కరించారు. సాయంత్రం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో డీఈఓ బి.భిక్షపతి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీ సీఈఓ నంద్యాల ప్రేమ్‌కరణ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేశ్, జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి, నల్లగొండ ఎంఈఓ అరుంధతి, డీపీఆర్వో వెంకటేశ్వర్లు, డాన్‌బాస్కో పాఠశాల ప్రిన్సిపాల్ బాలశౌరీ, ఉప రవాణా శాఖ కమిషనర్ వాణి పాల్గొన్నారు. సైన్స్‌ఫెయిర్ శనివారం ముగియనుంది. సాయంత్రం 4గంటలకు విజేతలకు బహుమతుల ప్రదానం చేయడంతోపాటు రాష్ట్రస్థాయికి ఎంపికైన ఎగ్జిబిట్లను వెల్లడిస్తారు. ముఖ్యఅతిథిగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరు కానున్నట్లు సమాచారం.

ఆత్మకూరు(ఎం)లోని వీర్ల చెరువుకు గోదావరి జలాలు రావడంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

చెరువులకు కాళేశ్వరం జలాలు

- సీఎం కేసీఆర్ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేసిన రైతులు

ఆత్మకూరు(ఎం), జనవరి 3 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి మాజీ సీఎం కేసీఆర్ ముందుచూపుతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మేడిగడ్డ నుంచి గోదావరి జలాలు జిల్లాకు అందుతున్నాయి. తాజాగా ఆత్మకూరు(ఎం)లోని వీర్ల చెరువుకు నీళ్లు రావడంతో శుక్రవారం రైతులు స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి చెరువు వద్ద కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంలో రూ.కోటీ 30లక్షలతో మిషన్ కాకతీయలో చెరువు పునరద్ధరణ చేపట్టినట్లు తెలిపారు. మండలంలోని బిక్కేరువాగులపై మోదుగుబావిగూడెం, టి.రేపాక, పారుపల్లి, కాముని గూడెం, కొరటికల్ గ్రామాల్లో చెక్‌డ్యామ్‌లు నిర్మించిన ఘనత కూడా కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు యాస ఇంద్రారెడ్డి, కొరె బిక్షపతి, మాజీ ఎంపీటీసీ యాస కవిత, బీసు ధనలక్ష్మీ, సోలిపురం అరుణ, నాతిరాజు, అజీమ్ మొద్దీన్, అబ్బసాయిలు, విజయ్, వెంకన్న, రాంబాబు, స్వామి, సత్తయ్య, ఉపేందర్‌రెడ్డి, లింగయ్య, ఉప్పలయ్య రైతులు పాల్గొన్నారు.

కూనూరు చెరువు వద్ద మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కూనూరు చెరువు వద్ద రైతుల సంబురాలు

భువనగిరి కలెక్టరేట్ : భువనగిరి మండలంలోని కూనూరు గ్రామ చెరువు కాళేశ్వరం జలాల ద్వారా జలకళను సంతరించుకుని అలుగు పోస్తుండగా, శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు చెరువు వద్ద సంబురాలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ అబ్బగాని వెంకట్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణలో రైతును రాజును చేయాలన్న సంకల్పంతో పని చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ అని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు పాశం మహేశ్, మాజీ సర్పంచ్‌లు అంకర్ల మురళీకృష్ణ, డోకె బాలకృష్ణణ్, నాయకులు వడి కర్ణాకర్, శ్రీనివాస్, చందర్‌రావు, బుగ్గ శంకర్, గుండ్ల రాములు, వడి మహేశ్, వడ్లకొండ పాండు, రైతులు దొమ్మాటి రాములు, రాంచందర్, రాములు, బుగ్గ రాములు, బుగ్గ బలరాం పాల్గొన్నారు.

12 బెటాలియన్‌లో కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్

ఉత్సాహంగా కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్

- పోలీసులు అంకితభావంతో పని చేయాలి : ఐజీ రమేశ్

నీలగిరి, జనవరి 3: పోలీసులు అంకితభావంతో విధులు నిర్వరించి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (పీఅండ్ఎల్) ఎం.రమేశ్ అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో సమీపంలోని 12వ బెటాలియన్‌లో వికారాబాద్, కామారెడ్డి, రామగుండం జిల్లాలకు చెందిన 450 మంది కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిది నెలలపాటు కఠోర శ్రమకు ఓర్చి శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లను అభినందించారు. నూతన ఉత్సాహంతో ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించాలని సూచించారు. పోలీస్ శాఖలో ఉద్యోగం అంటే సవాళ్లతో కూడుకున్నదని, శారీరకంగా, మానసికంకగా దృఢంగా ఉన్నప్పుడే వాటిని ఎదుర్కోగలమన్నారు.

కార్యక్రమంలో కమాండెంట్ కె.వీర య్య, ఎస్పీ శరత్ చంద్ర పవార్, అసిస్టెంట్ కమాండెంట్ ఎం.వెంకటేశ్వర్లు, సీహెచ్ ఆంజనేయరెడ్డి, నర్సింగ్ వెంకన్న, అడ్మినిస్ట్రేటివ్ అఫీసర్ అతీక్ ఉర్ రెహమాన్, యూని ట్ మెడికల్ ఆఫీసర్ షర్మిలాదేవి, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు. పాసింగ్ అవుట్ పరేడ్‌లో భాగంగా కానిస్టేబుళ్లు చేసిన కవాతు, కరాటే విన్యాసాలు, సెల్ఫ్ డిఫెన్స్, సెంట్రీ డిఫెన్స్ విన్యాసాలు, బెటాలియన్ బృందం నిర్వహించిన బ్రాండ్ ప్రదర్శన ఆకట్టుకున్నాయి.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

భువనగిరి అర్బన్, జనవరి 3 : తెలంగాణ సాంఘిక, గిరిజన, బీసీ, సాధారణ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని భువనగిరి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, జిల్లా సమన్వయకర్త సి.జగదీశ్వర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో రూ.100 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఫిబ్రవరి 23న ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు www.tgcet.cgg.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

నల్లగొండ ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

- బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థుల ఆందోళన

నల్లగొండ రూరల్, జనవరి 3: ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థులకు చదువులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం అధ్వర్యంలో శుక్రవారం నల్లగొండ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ముందుగా విద్యార్థులతో భారీ ర్యాలీగా అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మిర్యాలయాదగిరి, జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ, ఇంటర్మీడియట్ విద్యార్థుల ఫీజు రీయింబర్స్ విడుదల చేయకపోవడం వారి చదువులకు ఆటంకంగా మారుతున్నదన్నారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓ అశోక్‌రెడ్డికి అందజేశామన్నారు. కార్యక్రమంలో మునాస ప్రసన్న, రమేశ్, పుట్ట వెంకన్న, రవీందర్, కీర్తి, శ్రీనివాస్, కృష్ణ, సతీష్, శివ, గిరి, గణేశ్ పాల్గొన్నారు.